# తెల్వదామల్ల??

ఓవెల వెంకటేశ్వర్లు

పట్నం వచ్చి సిటీ బస్సులో తిరుగుతూ వుంటే నా స్నేహితుడు ఎప్పుడూ చెబుతుండే జోక్ గుర్తుకు వచ్చేది. కుస్తీ పోటీలకు పంపేవారిని ఆరు నెలలపాటు సిటీ బస్సుల్లో తిప్పితే చాలు అన్నిపట్లు వస్తాయి. మనదేశానికి పతకాలు వస్తాయి. వీళ్లకి శిక్షణ పేరిట వ్యయం ఉండదు. అటు కీర్తికి కీర్తి వస్తుందని చెప్పేవాడు. 'మరీ అంత అతిశయోక్తిగా మాట్లాడకు లేవోయ్'అంటూ చిరాకు పడేవాడిని కాని ఇప్పుడు సిటీబస్సుల్లో తిరుగుతుంటే వాడన్నమాటల్లో ఎంతమాత్రం అబద్ధం లేదనిపించింది.



నేను ఉద్యోగం చేసేది సింగరేణి బొగ్గు గనుల్లో అయినా ఉద్యోగ నిమిత్తం పట్నం రావడం తప్పడం లేదు. ఇక్కడ హోటళ్లు, సినిమాలు, జల్సాగా ఉన్న తిరిగే తిరుగుళ్లకు ఒళ్లు హూనం అయ్యేది. 'ఎప్పుడు మళ్లీ వచ్చి ఇంట్లోకి చేరుతానా' అనిపించేది. సాధ్యమైనంత వరకు రాకుండా ఉండటానికి ప్రయత్నించినా అప్పుడప్పుడు వస్తూనే ఉన్నాను.

సికింద్రాబాద్ స్టేషన్ రాగానే ఎక్కేవారిని తోసుకుంటూ లోపలికి వెళ్లేసరికి 'సిర్‌పూర్ కాగజ్ నగర్ వెళ్లే భాగ్యనగర్ ఎక్స్‌ప్రెస్ పది నిమిషాలలో ఒకటవ నంబరు ప్లాట్‌ఫారంపైకి వచ్చును' అంటూ మూడు భాషల్లో ఎనౌన్స్‌మెంట్ వినిపిస్తోంది. హమ్మయ్య! మొత్తానికి సమయానికి చేరుకున్నాను.

టిక్కెట్టు కౌంటరు వైపు చూశాను. "క్యూ" పెద్దగా వుంది. లాభంలేదు. ఇంత పొడవైన క్యూలో నిలబడి టిక్కెట్టు తీసే ఓపిక లేదు. ముందుకు నడిచాను. నిలబడ్డ వారిని పరిశీలనగా చూశాను. అడగ్గానే టిక్కెట్టు తేవడానికి సుముఖత వ్యక్తం చేసే ఫేస్ ఏదైనా కనిపిస్తుందేమోనని. ఊహూ. లాభంలేదు. అయినా ప్రయత్నిద్దామని "హలో ఒకటి రామగుండం తీసుకోండి ప్లీజ్" చాలా వినయంగా అడిగాను.

"చాలానే ఉన్నాయి" అంటూ చేతిలోని డబ్బులు చూపించాడు.

"పర్వాలేదు ఇస్తారు తీసుకోండి"

"ఉన్నాయని చెబుతున్నాగా" విసుగ్గా అన్నాడు. ఇక మళ్లీ అడగాలనిపించలేదు ఎవ్వరిని. "లైన్‌లో నిలబడితే గౌరవం పోతుంది కావచ్చు", "నిలబడ్డ వాళ్లం మనుష్యులం కాదా" వంటి మాటలు వినిపిస్తుంటే ఎందుకొచ్చిన గొడవ వెళ్లి లైన్‌లో రావడం మంచిదని వెనక్కి మళ్లాను. మరింత పొడవు పెరిగింది. ఇటువైపు ఆడవాళ్లను రిక్వెస్టు చేస్తున్నారు కొంతమంది పట్టువదలని విక్రమార్కులు. అప్పుడు గుర్తొచ్చింది నాకు "ముసలమ్మ". అప్పుడు ముసలమ్మ కనిపిస్తుందేమోనని చూశాను. గతంలో వచ్చిన ప్పుడు "ముసలమ్మ"ను చూశాను. అడిగిన వారికి టిక్కెట్లు తీసిచ్చి వాళ్లిచ్చింది పుచ్చుకునేది. చూస్తూండగానే

ఎంతోమంది గుమిగూడి ఆమె ద్వారా టిక్కెట్లు తెప్పించుకుని చిల్లర డబ్బులు చేతిలో పెట్టేవారు. 'ఇంత ఇవ్వండి' అని మాత్రం అడిగేది కాదు.

ఆడవాళ్ల లైన్ తక్కువగా వుండేది కాబట్టి వెంట వెంటనే టిక్కెట్లు తీసుకోవడానికి కౌంటర్ వైపు వెళ్లేది.

"ఏయ్ ముసల్దానా ఎన్నిసార్లు టిక్కెట్లు తీస్తావు. ఇక్కడ నిలబడి నిలబడి చస్తున్నాము."

"ముసల్దాన్ని పోనీ బిడ్డా! ఎందుకు గుస్స చేస్తవు"

"మరి నాక్కూడా తీసుకుంటవా"

"ఇయ్యి బిడ్డా తీసుకుంటా"

"మొత్తానికి బ్రతక నేర్చినవు"

"ఏంజెయ్యమంటవ్ కొడుకా! సచ్చేదాకా ఇంత కడుపుకు తినాలె కదా" అంటూ ముందుకు సాగిపోయేది.

ఆ వయస్సులో కూడా ఆమె బ్రతుకు పోరాటం చేస్తోంది. కొడుకులుండి ఆదరించకపోయి వుండవచ్చు. పెళ్లాల చేతిలో కీలు బొమ్మలై తల్లిని తరిమేసి వుండవచ్చు. మొత్తానికి ఆమె జీవితం విషాదమైనదేనని ఒప్పుకు తీరాల్సిన నిజం.

"ముందుకు నడు నడు" వెనక నుండి నెడుతు అనేసరికి ఆలోచనల నుంచి బయటికొచ్చి ముందుకు జరిగాను. ఆశ్చర్యం. అక్కడ కౌంటర్ దగ్గర ముసలమ్మ. ఎందుకో తెలియని తృప్తి అనిపించింది. మనం వెదికే వస్తువు చాలా సేపు తరువాత కనిపిస్తే కలిగే సంతోషం. టిక్కెట్లు తియ్యడానికి చెయ్యి ముందుకు సాచింది.

గమ్మత్తుగా అనిపించింది. బ్రతుకు గడపడానికి ఎన్ని మార్గాలు అన్వేషిస్తామో గదా! రకరకాల మార్గాలు. మొన్న టాంక్‌బండ్ మీద చూసిన దృశ్యం గుర్తొచ్చింది. బుద్ధ విగ్రహాన్ని చూడ్డానికి రూపాయి వసూలు చేసి బైనాక్యులర్స్‌తో చూపిస్తున్నారు. మనం నేరుగా చూస్తున్నది బుద్ధ విగ్రహమే అయినా దీంట్లో నుండి చూడ్డం అదో సరదా.

'ఏహోయ్! ఏమైనా గిట్టుబాటు అవుతుందా?' అని అడిగా.

"ఏం గిట్టుబాటుసార్! మొదట్లో దీన్ని తెచ్చింది నేనే. అప్పుడు రోజుకు డెబ్భైఐదు నుండి వంద రూపాయల వరకు సంపాదించేవాడ్ని. ఇప్పుడు పోటీ పెరిగిపోయింది. నాలాగా ఎంతమంది ఉన్నారో చూశారుగా" నిరాశాజనకంగా చెప్పాడు అతడు.

పోటీ లేనిది దేనిలో? ఉద్యోగాల నుండి బిచ్చగాళ్ల వరకు అన్నిట్లోనూ పోటీయే. ఆఖరికి జనాభా పెంచడంలో కూడా పోటీ పడిపోవడమే బాధాకరం, ఇన్ని బాధలకు కారణం.

"ఏంటయ్యా! టిక్కెట్టు తీసుకోవడానికి నిలబడ్డావా? లేక కలలు కనడానికా?" వెనుక నుండి ఒక్క నెట్టు నెట్టాడు. వచ్చి కౌంటర్ ముందు పడ్డాను.

"టిక్కెట్టు అక్కర్లేదా?" విసుగ్గా అడిగాడు బుకింగ్ క్లర్క్.

డబ్బులిచ్చి "రామగుండం ఒక్కటి" చెప్పాను సర్రున లాగి మిషన్లో పెట్టి ఒక్క నొక్కు నొక్కి నా మొహం మీద పడేశాడు. భద్రంగా తీసుకొని దానిమీది ఖరీదు చూస్తూ బయటికి వచ్చాను. ఇంతలో ఏదో గొడవ వినిపిస్తే అటువైపు చూశాను.

ముసలమ్మ! ఎవరితోనో గొడవపడుతోంది. తెలియకుండానే అటువైపు కదిలానో లేక వెళ్లడం అటువైపు కనుక దారి మధ్యలో ఆగానో గాని గొడవ దగ్గిర మాత్రం ఆగాను. ముసలమ్మ చేతిలో నాలుగు టిక్కెట్లు ఉన్నాయి.

"టిక్కెట్టుకు రూపాయి ఇయ్యాలే సారూ" అంటోంది ముసలమ్మ.

"తక్కువ ఇస్తే తీసుకోవా?" అంటున్నాడతను.

"అందరూ ఇత్తాండ్రు కదా సారూ"

"అందరిస్తే నేనివ్వాలని ఏమైనా రూలా?" అతడి స్వరం హెచ్చుతోంది. ఏదో పోనీ పాపం అని యిస్తే.."

"పుణ్యానికి ఇత్తాండ్ర సారూ" ఈసారి ముసలమ్మ కంఠంలో అదోరకమైన మార్పు.

అతను కొంచెం ఖంగు తిన్నట్టున్నాడు.

నాకు ఆశ్చర్యం వేసింది. ఇచ్చినంత తీసుకునే ముసలమ్మ ఇప్పుడు డిమాండ్ చేస్తోంది. మనిషి బలహీనతలను కనిపెట్టి డబ్బు చేసుకోవడం అబ్బినట్టుంది. ఎందుకో ముసలమ్మ మీద కోపం వచ్చింది.

"మర్యాదగా ఇచ్చింది తీసుకొని పోతావా? లేకపోతే పోలీసులను పిలవనా?" ఇంత దూరం వచ్చాక అడిగినంత ఇచ్చి వెళ్లడం అతనికి అవమానంగా తోచి వుండవచ్చు. అందుకే పోలీసులను పిలుస్తానన్నాడు. అప్పటికే అందరూ అటువైపు చూస్తున్నారు.

"పిలువుండ్రి. పోలీసులను పిలిత్తే భయమా. దొంగతనం చేత్తనానా, లంజతనమా! బ్లాక్‌ల గిట్ల టిక్కెట్టు అమ్మతాననా! అడ్డమైన సినిమాలకు టిక్కెట్లుకు ఎంతంటే అంత పెట్టి కొంటరు. గీ రూపాయి కాడా గుంజులాడుతున్నావు. పోలీసుల ను పిలుత్త అని భయపెట్టేత్తున్నావు. పిలువు. పోలీసులకు తెల్వకుంటనే గీ పని చేత్తననా..." ముసలమ్మ కోపంగా మాట్లాడే సరికి ఏమనుకు న్నాడేమో కిక్కురుమనకుండా డబ్బులు ఇచ్చి వెళ్లిపోయాడు. ఆమె వెళ్లిపోయింది మళ్లీ టిక్కెట్లు తీయడానికి.

'పోలీసులకు తెల్వకుంటనే గీ పని చేత్తననా' అన్న మాటలకు అర్థాలు వెతుక్కుంటూ ప్లాట్‌ఫారం వైపు అడుగులు వేశాను. ●

